క్లుప్తంగా

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసు సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా కే వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న ఎన్ కోటారెడ్డి బదిలీ అయ్యారు. నూతన డీఎస్పీని డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సంధ్యాలక్ష్మి బుధవారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కొండాపురం ఎంపీడీఓగా బ్రహ్మయ్య



ఎంపీడీఓ సుజాతకు సత్కారం

కొండాపురం : మండలం ఎంపీడీఓగా ఆర్ బ్రహ్మయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పీ సుజాత ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమెను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏఓ శేషసాయి, ఈఓపీఆర్డీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ



సీతారామపురం: స్థానిక ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి బుధవారం భూమిపూజ చేశారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎంపీపీ గ్రాంట్ కింద రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సీతారామపురం, బసినేనిపల్లి సర్పంచ్‌లు భాగ్యకుమారి, పల్లె విజయమ్మ, కోఆప్షన్ సభ్యుడు హైదర్‌అలీ, వార్డు సభ్యుడు దంతిక జయపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పిడతల ఓబులేసు, బక్కా కొండయ్య, పిచ్చయ్య, ఖాసీంపీరా, పంచాయతీ కార్యదర్శి జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

వరికుంటపాడు: మండల ఎంపీడీఓగా పనిచేస్తూ పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్తున్న తోట వెంకటకృష్ణకుమారిని ఎంపీడీఓ కార్యాలయ, సచివాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓగా అందించిన సేవలను కొనియాడారు. ఈఓపీఆర్డీ సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని నార్త్‌ఆములూరు, బీరంగుంట గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ షేక్ మస్తాన్‌షరీఫ్ బుధవారం తెలియజేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

సీతారామపురం: స్థానిక కురవవీధికి చెందిన ఆదోని నవీన్‌కుమార్ (20) మంగళవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ ఇంటర్‌లో రెండుసార్లు ఫెయిలయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు.

అదుపుతప్పిన కారు

మర్రిపాడు: మండలంలోని గంగుంట సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై వెళ్తున్న కారు బుధవారం రాత్రి అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

దేశ భవిష్యత్ యువత చేతిలోనే

ఆత్మకూరు: దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, యువత క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ మార్గంలో పయనించి ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. అఖండ భారత దివస్ సందర్భంగా పట్టణంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో 'దేశ విభజన విషాద గాథ' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఆంజనేయరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై దేశ విభజన నాటి పరిస్థితులను వివరించారు. బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు

- సమయాన్ని పాటించని వైద్యసిబ్బంది
- ఉదయం 10 నుంచి 12 గంటల వరకే అందుబాటులో
- ఆ తరువాత కనిపించని వైనం
- జనరేటర్ ఉన్నా కరెంట్‌పోతే తప్పని ఉక్కపోత
- నిరుపయోగంగా ఎక్స్‌రే మెషిన్
- ఇబ్బందులు పడుతున్న రోగులు





కరెంట్ పోవడంతో తమ చంటి బిడ్డలకు పేపర్‌తో గాలి విసురుతున్న బాలింతలు

కావలి: కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని వైద్య సిబ్బంది నిర్లక్ష్యపు జబ్బు వెంటాడుతోంది. వైద్యులతో పాటు సిబ్బంది విధుల నిర్వహణలో సమయపాలన పాటించడం లేదు. ఆస్పత్రిలో ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు ఉండరో కూడా తెలియడం లేదు. ఎక్కువ మంది ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రెండు గంటల పాటు మాత్రమే ఆస్పత్రి ప్రాంగణంలో కనిపిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. దీంతో వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వసతులు లేవు.. వేరే చోటుకు తీసుకెళ్లండి

కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాలకు చెందిన పేదలు నిత్యం వేయి మందికిపైగా వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు. వీరిలో 800 మంది వరకు పరీక్షలు చేయించుకుని ఆస్పత్రిలో ఇచ్చిన మందులు తీసుకుని వెళ్తుంటారు. మిగిలిన వారు ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతుంటారు. అలాగే చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారితో పాటు చెన్నై–విజయవాడ రైల్వే మార్గంలో నిత్యం జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ లేకపోవడం వల్ల క్షతగాత్రులకు అత్యవసర వైద్యసేవలు అందడం లేదు. వైద్యులు కూడా అందుబాటులో ఉండకపోతుండడంతో క్షతగాత్రులకు ఇక్కడ వైద్యం అందించే వసతులు లేవని, ఇతర చోట్లకు తీసుకెళ్లండి అని సిబ్బంది పంపించేస్తున్నారు.

నిరుపయోగంగా ఎక్స్‌రే మెషీన్

ఏరియా ఆస్పత్రిలో కొత్త ఎక్స్‌రే మెషీన్ ఉన్నా దాన్ని ఉపయోగించకుండా మూలనపడేశారు. పాత ఎక్స్‌రే మెషీన్‌కు సంబంధించిన టెక్నీషియన్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకే అందుబాటులో ఉంటున్నారు. ఆ తర్వాత రోగులకు ఎక్స్‌రే కావాల్సి వస్తే బయటకు వెళ్లాల్సిందే. అలాగే ఆస్పత్రిలోని ల్యాబ్‌లో థైరాయిడ్ పరీక్షలు చేసే సౌలభ్యం లేదు. దీంతో రోగులు బయటకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ఏ ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలో కూడా వైద్యులే చెబుతున్నారు. మిగిలిన పరీక్షలు చేసే సిబ్బంది ఇష్టారాజ్యంగా వేళలు పాటిస్తుండడంతో రోగులు అవస్థ పడుతుతున్నారు.

కరెంట్ పోతే ఉక్కపోత

ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నా వినియోగించడం లేదు. దీంతో కరెంట్‌పోతే ఇన్‌పేషెంట్లతో పాటు గర్భిణులు, బాలింతలు, శిశువులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రాత్రి వేళల్లో ఉక్కపోత, దోమల బారినుంచి తమ బిడ్డలను సంరక్షించుకోవడానికి బాలింతలు పడే బాధలు వర్ణనాతీతం. ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల్లో పేదలే ఎక్కువ. అందువల్ల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన వైద్యసేవలందించాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న నూతన గది



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని ఓపీ భవనం

కొన్ని ఘటనలు

- ఇటీవల కావలికి చెందిన ఓ వృద్ధురాలిని సాయంత్రం వేళ కుక్క కరిచింది. ఆమె ఒక్కటే ఏరియా ఆస్పత్రికి రాగా వైద్యులు లేరని వేచి ఉండాలని సిబ్బంది చెప్పారు. ఎంతసేపు వేచి ఉన్నా తనకు వైద్యం చేయకపోవడంతో వృద్ధురాలు 'నేను సస్తే అప్పుడు మందులు ఇస్తారా...' అంటూ అసహనం వ్యక్తం చేసింది. దీంతో సిబ్బంది వైద్యులకు ఫోన్ చేసి వృద్ధురాలి సమస్యను చెప్పగా అప్పుడు హడావిడిగా ఆమెకు ఇంజక్షన్ వేసి పంపారు.
- కావలి సమీపంలో ఉన్న ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మహిళ ఇంటి వద్ద మధ్యాహ్నం వేళ పనిచేస్తుండగా పాము కరిచింది. సదరు మహిళను కుటుంబసభ్యులు వైద్యం కోసం హుటాహుటిన కావలి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే ఆస్పత్రిలో వైద్యుల సంగతి దేవుడికి ఎరుక. కనీసం పలకరించడానికి సిబ్బంది ఒక్కరు కూడా లేరు. ఆలస్యమైతే ప్రాణం పోతుందనే ఆందోళనతో కుటుంబ సభ్యులు వారికి తెలిసిన రాజకీయ నాయకులకు ఫోన్లు చేయగా అప్పుడు సిబ్బంది ప్రత్యక్షమయ్యారు. కొద్ది సేపటికి ఒక డాక్టర్ అక్కడికి వచ్చారు. తీరా మందుల విభాగం మూసేయడంతో మహిళ కుటుంబసభ్యులు బయటకు వెళ్లి బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేశారు.
- కందుకూరు నియోజకవర్గంలోని ఒక గ్రామానికి చెందిన తల్లీకొడుకులు వైరల్ ఫీవర్‌తో కావలి ఏరియా ఆస్పత్రికి వచ్చారు. పరీక్షలు చేసుకుని రావాలని వైద్యులు వారికి స్లిప్పులు రాసి ఇచ్చారు. కొడుకు నడవలేక నీరసంగా ఉండడంతో బిడ్డను పక్కన పెట్టుకుని తల్లి ఆస్పత్రి ప్రాంగణంలో కొద్దిసేపు కూర్చుంది. ఆ తర్వాత పరీక్షలు చేయించుకోవడానికి ల్యాబ్‌కు వెళితే అక్కడ ఎవరూ లేరు. అక్కడున్న వారిని విచారించగా ఈ రోజు పరీక్షలు చేసే సమయం అయిపోయింది..మళ్లీ రేపు చేస్తారు అని చెప్పారు. చేసేదేమి లేక తల్లి తన కుమారుడిని వెంట పెట్టుకుని బాధాతప్త హృదయంతో ఆస్పత్రి ప్రాంగణం నుంచి బయటకు వెళ్లి పరీక్షలు చేయించుకుంది.

తలసేమియా డే కేర్ సెంటర్ ఏర్పాటు హర్షణీయం

- అపోలో ఆస్పత్రి డాక్టర్ రమ్య ఉప్పుటూరి



డాక్టర్ రమ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

కావలి: చిన్నపట్టణమైన కావలిలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని, ఇది కావలి పరిసర ప్రాంతాలతో పాటు ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన బాధిత చిన్నారులకు వరమని చెన్నై అపోలో ఆస్పత్రికి చెందిన చిన్నపిల్లల రక్త సంబంధిత వ్యాధుల నిపుణురాలు డాక్టర్ రమ్య ఉప్పుటూరి పేర్కొన్నారు. కావలి రెడ్‌క్రాస్ ఆహ్వానం మేరకు నూతనంగా నిర్మిస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్‌ను బుధవారం ఆమె సందర్శించారు. అనంతరం రెడ్‌క్రాస్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ ఎముక మూలగలో ఎర్రరక్త కణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్ని తలసేమియా వ్యాధిగా పేర్కొంటారని, ఇది ఒక జన్యు సంబంధమైన వ్యాధి అని తెలిపారు. బాధిత చిన్నారులకు ప్రతి మూడు వారాలు లేదా నెలకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. కావలి తలసేమియా డే కేర్ సెంటర్‌కు తన వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రముఖ రొటేరియన్ అనికేపల్లి రమేష్‌రెడ్డి, ఇతర వదాన్యుల సహకారంతో దాదాపు రూ.50 లక్షలతో డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు శ్రీధర్ స్వచ్ఛందంగా ప్రధాన వైద్యాధికారిగా ఉండడానికి అంగీకారం తెలిపారన్నారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తమార్పిడి ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, తలసేమియా కేంద్రం కన్వీనర్ హరినారపరెడ్డి, వైద్యాధికారి శ్రీధర్, నిర్వహణ కమిటీ సభ్యులు సౌందర్యదీపిక, నందనవనం సీతాలక్ష్మి, బెజవాడ ప్రసన్నకుమార్, ఐ రాజశేఖర్, టీం సేవియర్స్ ప్రణీత్, భార్గవ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

-మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరురూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రి ఆనం హాజరై శాఖల వారీగా సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్ కింద ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ.117 కోట్లు మంజూరు చేయగా, ఏడాది కాలంగా రూ.7 కోట్లు మాత్రమే ఖర్చు చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల ద్వారా మూడు లక్షల పని దినాలు కల్పించాల్సి ఉందన్నారు. 40 శాతం నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలన్నారు. ఆత్మకూరులోని బైపాస్ రోడ్డు విస్తరణ, నెల్లూరు పాళెం కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఇప్పటికే ఉన్న నాలుగులైన్ల రహదారి విస్తరణ పనుల కోసం రూ.5.60 కోట్లు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను త్వరలోనే ఆత్మకూరుకు తీసుకొచ్చి వంద పడకల జిల్లా ఆస్పత్రి స్థాయి పెంపునకు కృషి చేస్తామన్నారు. ఆర్డీఓ కురుబ మధులత, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డ్వామా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి చొరవచూపాలి

సీతారామపురం: మండలాభివృద్ధికి అధికార యంత్రాంగం చొరవచూపాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించి వలసల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అనంతరం విద్య, వ్యవసాయం, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖలపై సమీక్ష జరిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రావు, ఎంఈఓ మస్తాన్‌వలి, ఏఓ చెన్నారెడ్డి, ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి, హౌసింగ్ ఏఈ రామకృష్ణారావు, పీఆర్ ఏఈ ప్రవీణ్, ఏపీఓ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు

కొండాపురం : మండలంలో తెలుగు తమ్ముళ్ల నడుమ ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎన్నికల సమయంలో పలు గ్రామాల్లోని ఆలయాలకు ఆర్థిక సాయం అందజేశారు. అందుకు సంబంధించి కాకర్ల సురేష్ వర్గం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎన్నికల తరువాత నెలకొన్న వర్గపోరులో మరో వర్గం ధ్వంసం చేస్తోంది. మర్రిగుంటలో పోతురాజు ఆరుగు చుట్టూ స్టీల్‌గ్రిల్స్, నేకునాంపేట పంచాయతీ తూర్పుపాళెం ఎస్సీ కాలనీ రామాలయానికి అందజేసిన విరాళానికి సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై దాడులకు తెగబడుతున్న తమ్ముళ్లు ఆధిపత్య పోరుతో తమలో తామే తన్నుకోవడం చర్చనీయాంశంగా మారింది.

బాలికల సంరక్షణపై దృష్టి సారించాలి

సీతారామపురం: బాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అంజయ్య అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను బుధవారం న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక వసతులు, భోజనం నాణ్యత, వంటగది, తరగతి గదులను పరిశీలించి వైద్యసేవలపై ఆరా తీశారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎస్సై అనూష, ఎస్ఓ షాహిదా, పోలీసు, కేజీబీవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మరో ముగ్గురు మత్తు నిందితులు

కావలి: పట్టణంలో మత్తు పదార్థాల వినియోగం, అమ్మకాలకు సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు చేపడుతున్న కావలి రెండో టౌన్ పోలీసులు బుధవారం మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ పర్యవేక్షణలో రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఆరుగురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అత్యంత గోప్యంగా నిందితులను తమదైన శైలిలో విచారించగా మరో ముగ్గురి పేర్లు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కాగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి 'మత్తు' కేసు విచారణలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పకడ్బందీగా విచారణ చేయాలని పోలీసులకు సూచించారని తెలిసింది. దీంతో నిందితులను కాపాడేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదని చెబుతున్నారు. కాగా ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



దుత్తలూరులో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



అల్లూరులో..



సీతారామపురంలో..

అల్లూరు/ఆత్మకూరురూరల్/అనుమసముద్రంపేట/దుత్తలూరు/సీతారామపురం/కొండాపురం: ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అల్లూరులో ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ శశిరేఖ బైక్ ర్యాలీని జెండాను ఊపి ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మహిళా అధికారులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఆత్మకూరు మండలం అశ్వనీపురంలో ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏఎస్‌పేటలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దుత్తలూరులో ఆదర్శ పాఠశాల నుంచి సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవ హారం ఏర్పాటు చేశారు సీతారామపురంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ పద్మావతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రావు , ఎంఈఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు. కొండాపురంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్‌లో..



కొండాపురంలో..



ఏఎస్‌పేటలో..

మహనీయుల త్యాగఫలం స్వాతంత్య్రం



కావలి: 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి నియోజకవర్గ ప్రజలకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగఫలమే స్వాతంత్య్రమని, బ్రిటీష్ వలస పాలన నుంచి మన దేశానికి విముక్తి కల్పించేందుకు ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం ముందుకు సాగాలని కాంక్షించారు.